ప్రజాశక్తి

సోమవారం 19 జూన్ 2023

5

శ్రీ సత్యసాయి

20న పుట్టపర్తిలో 'ఎంహెచ్' అవార్డుల ప్రదానోత్సవం

'రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు - మీడియా పాత్ర' పై సెమినార్

హాజరుకానున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాలగౌడ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈనెల 20న శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రంలో ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మోటూరు హనుమంతరావు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజాశక్తి అనంతపురం ఉమ్మడి జిల్లా ఎడిషన్ మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రతినిధులు, ప్రజాశక్తి రాష్ట్రస్థాయి నాయకత్వం పాల్గొననుందని చెప్పారు. ఈ సందర్భంగా "రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు- మీడియా పాత్ర" అనే అంశంపై సెమినార్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులు బి. తులసీదాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యవక్తగా సుప్రీంకోర్టు పూర్వన్యాయమూర్తి గోపాలగౌడ హాజరవుతున్నారని ఈయనతోపాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీ చరణ్, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, ప్రజాశక్తి అభిమానులు హాజరు కానున్నారని చెప్పారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ ,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుర ప్రముఖులు ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. గౌరవ అతిథులుగా అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్ తెలకపల్లి రవి, నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అనిత, కవి సీనియర్ పాత్రికేయుడు నల్లిధర్మారావు, ప్రజాశక్తి సిజిఎం అచ్యుతరావు హాజరవుతున్నట్లు చెప్పారు. ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును హైదరాబాదు నుంచి వెలువడే నవభూమి పత్రిక జర్నలిస్టు తుమ్మలపల్లి ప్రసాద్‌కు, విఆర్. బొమ్మారెడ్డి స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు బ్యూరో, స్టాఫర్ కేటగిరిలో రాజమహేంద్రవరం స్టాఫర్ బి. శ్రీనివాసాచారికి, మండల విలేకరుల కేటగిరిలో హిందూపురం, సింగరాయకొండ విలేకరులు షబ్బీర్, పి. రవికుమార్‌కు ఈసందర్భంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం పుట్టపర్తి లోని జానకి రామయ్య కళ్యాణ మండపంలో ఉదయం 10:00లకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని విలేకరులు, మేధావులు, విద్యావేత్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చెత్తకుప్పల్లో మెడికల్ వ్యర్థాలు

ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నా చర్యలు శూన్యం

చోద్యం చూస్తున్న మున్సిపల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

మనం ఏదైనా ఆసుపత్రికి వెళితే వైద్యులు వ్యాధి నిర్ధారణ కోసం రక్త పరీక్ష చేయించుకుని రమ్మంటారు. వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు అవసరాన్ని బట్టి ఇంజక్షన్ వేస్తారు.. వీటి కోసం వినియోగించిన సిరంజిలను ఎక్కడ పడితే అక్కడ వేయడం ప్రాణాంతకం. వాటిని తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన బయోమెడికల్ వ్యర్థ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ఇవ్వాలి. కొందరు వైద్యులు కక్కుర్తిపడి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వాహకులకు వ్యర్థాలు ఇవ్వడం లేదు. రోడ్లపై, చెత్త కుండీల్లో పడేస్తున్నారు. వందల సంఖ్యలో చిన్న, పెద్ద ఆసుపత్రులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. ఆసుపత్రులు, ల్యాబ్‌ల వ్యర్థాలను వీరికి ఇవ్వకుండా రోడ్లపై, చెత్త కుండీల్లో, మున్సిపల్ చెత్త వాహనాల్లో వేస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రయివేట్ ఆసుపత్రులు, వాటికి అనుసంధానమైన ల్యాబరేటరీలు, మెడికల్ షాపుల నుండి రోజుకు కొన్ని వేలల్లో బయోవ్యర్థాలు పోగవుతూ ఉంటాయి. అలా పోగైన బయోవ్యర్థాలను సాధారణ వ్యర్థాలను తొలగించే పురపాలక వాహనాలలో కాకుండా ఒక ప్రత్యేక వాహనం ద్వారా జనావాసాలు లేని ఒక సురక్షితమైన ప్రాంతానికి తరలించి అక్కడ కాల్చివేయాల్సి ఉంది. అయితే పట్టణంలో అలాంటి పరిస్థితులు కనబడటం లేదు. ఆసుపత్రులు నుంచి విడుదలయ్యే సూదులు, సిరంజిలు, గాయాలకు కట్టు కట్టిన దూది, కట్టు గుడ్డ, బ్యాండేజ్ క్లాత్స్, బ్లడ్ బాగ్స్, సెలైన్ బాటిళ్లు, ఐవి సెట్లు, గ్లౌజులు, లాబరేటరీలు నుంచి విడుదలయ్యే రక్తం తీయుటకు వినియోగించిన సూదులు, దూది, డిస్పోజల్ టెస్ట్ ట్యూబ్‌లు, మెడికల్ షాపుల నుంచి విడుదలయ్యే ఎక్స్పైరీ డేట్ అయిపోయిన మందులు మొదలైన వాటిని ఎక్కడ బడితే అక్కడ రోడ్లమీద, మురుగు కాలువలు, చెత్త డబ్బాలలోను విచ్చల విడిగా పడవేస్తున్నారు. ఇలా పడవేయడం వలన చెత్త ఎత్తే సమయంలో వాటి బారిన పడి మున్సిపల్ కార్మికులు అనారోగ్యాల పాలయ్యే

రోడ్డుపక్కన పడేసిన మెడికల్ వ్యర్థాలు

ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. హెచ్ఐవి రోగులకు వినియోగించే సూదులు, బయోవ్యర్థాలు సైతం అందులో ఉండడం వలన పొరపాటున కార్మికులకు ఆ సూదులు గుచ్చుకుంటే వారి జీవితాలు తారుమారయ్యే ప్రమాదం లేకపోలేదు. చెత్తకుప్పల దగ్గర వాటిని పడవేయడం వల్ల ఆవులు, కుక్కలు, ఇతర జంతువులు వాటిని తిని గాయాలపాలై రోగాల బారిన పడే ప్రమాదం ఉంది.బయోవ్యర్థాల మేనేజ్మెంట్ చట్టం 1996 యాక్ట్ ప్రకారం ఈ వ్యర్థాలు ఇతర సాధారణ వ్యర్థాలతో కలపకూడదు. ప్రత్యేకమైన జాగ్రత్తలతో తరలించి వాటిని కాల్చివేయాలని చట్టం చెబుతోంది. అనంతపురం నగరంలో అయితే బయోవ్యర్థాలను తరలించడానికి ప్రత్యేకమైన కంటైనర్లను వినియోగిస్తున్నారు. హిందూపురం పట్టణంలోని బయో వ్యర్థాలను తరలిండానికి అదే వాహనం వస్తోంది. అయితే ఆ వాహనం పట్టణానికి రెండు మూడు రోజులకు ఒకసారి రావడంతో కొంత మంది వారి అసుపత్రులు, ల్యాబ్ నిర్వహకులు మెడికల్ వ్యర్థాలను చెత్తకుప్పల్లో, పట్టణ శివారు ప్రాంతాల్లో వేస్తున్నారు. ఇలా మూడు నెలల క్రితం ఆటోనగర్ సమీపంలో ఓ పాడుపడిన బావిలో మెడికల్ వ్యర్థలు వేశారు. ఎండ తీవ్రతకు మెడికల్ వ్యర్థాలు వేసిన బావిలో మంటలు రేగి గ్యాస్ లీకేజీ అయినట్లు వాసన వచ్చింది. దీంతో సమీపంలో నివాసాలు ఉన్నవారు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి కమిషనర్ పోలీస్, ఫైర్ అధికారుల సహకారంతో ఆయ బావిని మూసివేయించారు. ఇంకా కొంత మంది ధర్మపురం, ఆర్‌పిజిటి రోడ్డులో ఉన్నా చెత్త కుప్పల్లో బయోవ్యర్థలు వేస్తున్నారు. అయినప్పటికి మున్సిపల్ అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఇలాంటి వాటిపై ప్రత్యేకమైన చర్యలు చేపట్టకపోతే ప్రజలు, పశువులకు ప్రాణాహానితో పాటు పర్యావరణం కూడా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా బయో మెడికల్ వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేకమైన కంటైనర్లు, వాహనాలను వినియోగించాలని కోరుతున్నారు. ఈ వ్యర్థాలను ఆసుపత్రులు, మెడికల్ షాపులు, లేబరేటరీల వారు ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా చెత్తకుప్పల లోను, డ్రైనేజీల్లోనూ పడవేయకుండా మునిసిపల్, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రయివేటు ఆసుపత్రులు బయోవ్యర్థాలను తరలించడానికి రుసుము చెల్లించి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. కాని వారు అలా చేయడం లేదు. ఇదే సమస్యపై గతంలో ఆసుపత్రుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. కానీ ప్రైవేటు ఆసుపత్రుల వారు షరా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సమస్య పట్ల ప్రైవేటు ఆసుపత్రులకు గట్టిగా హెచ్చరికలు జారీ చేసి అదుపు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

నాగేంద్ర.
పర్యావరణ అసిస్టెంట్ ఇంజనీర్

జెఇఇ అడ్వాన్స్‌లో మెరిసిన 'పురం' విద్యార్థులు

ప్రజాశక్తి - హిందూపురం

జెఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో 'పురం' విద్యార్థులు మెరిశారు. ఈ ఫలితాలపై ఆదివారం సువర్ణ భారతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి, ఎఓ అనిల్ మాట్లాడుతూ తమ విద్యార్థి సాయి గణేష్ జాతీయ స్థాయిలో ఒబిసి క్యాటగిరీలో 7,947 ర్యాంకు సాధించారన్నారు. అలాగే పట్టణంలోని నారాయణ కళాశాలకు చెందిన జోష్ణ ఎస్టీ క్యాటగిరీలో జాతీయ స్థాయిలో 466 ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపల్ లక్ష్మణ్, ఏజీఎం కేశవరెడ్డి తెలిపారు.

సాయి గణేష్

జోష్ణ

పాఠశాలలోని ఓగదిలో విక్రయానికి ఉంచిన విద్యాసామగ్రి

'ప్రయివేటు' దందా..

నిబంధనలకు తిలోదకాలు

ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలంలోని ప్రయివేటు పాఠశాలలు దందాకు తెరలేపాయి. ప్రయివేటు పాఠశాల యాజమాన్యాలు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందికకాడికి దోచుకుంటున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రవేటు పాఠశాలలు నయాదందాకు తెరలేపాయి. కొత్తచెరువులో నారాయణ, శ్రీ చైతన్య, శాంతినికేతన్, విశ్వభారతి పాఠశాలలు ఉన్నాయి. నారాయణ పాఠశాల అద్దె భవనంలో ఇరుకు గదులలో కొనసాగుతోంది. నర్సరీ నుండి పదవ తరగతి వరకు రూ. 23 వేల నుండి 35 వేల రూపాయల దాకా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. వారే స్కూలు యూనిఫాం, పుస్తకాలు, ఇతర మెటీరియల్‌ను విక్రయిస్తున్నారు. వీటికోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ. 10వేల దాకా వసూలు చేస్తున్నారు. శ్రీ చైతన్య పాఠశాలను గత ఏడాది శ్రీవిద్య కళాశాలలో అనుమతులు రాకుండానే ప్రారంభించారు ఈ ఏడాది కూడా అనుమతులు రాకపోవడంతో ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. విశ్వ భారతి పాఠశాల ఊరి మధ్యలో జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఉంది.ఇందులో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సౌకర్యాలు ఎలాగున్నా ఫీజులు మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. మండలానికి డిఇఒ ఆఫీసుకు కూత వేటు దూరంలో ఉన్నా వారు ఈ ప్రయివేటు దందాపై ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు పాటించని ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

ప్రభుత్వ వసతిగృహాలకు మహర్దశ

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివరంగప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్న 26 సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలు త్వరలో మారనున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివ రంగ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు కింద ఏ విధంగా అభివృద్ధి చేశారో అదేవిధంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలను ఆరు నెలలు లోపు మార్చనున్నారని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించడంతోపాటు ఇంటర్నెట్, కలర్ టీవీ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ప్రశ్న:శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్ని హాస్టల్లో ఉన్నాయి. వాటిలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఎన్ని?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లావ్యాప్తంగా 26 సాంఘిక సంక్షేమ హాస్టల్ ఉన్నాయి. వాటిలో మూడు నుండి పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన హాస్టళ్లు బాలురకు 12, బాలికలకు 5 ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఇంటర్మీడియట్ చదివే బాలికలకు 5, బాలురకు 4 ఉన్నాయి.

ప్ర: విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు సరిగా అందుతున్నాయా.?

జ: గతంలో మాదిరిగా కాకుండా విద్యార్థులకు నెలనెలా ఇవ్వాల్సిన కాస్మోటిక్ ఛార్జీలను మార్చి 2023లోనే వారి తల్లుల ఖాతాల్లో జమ చేశాం. మెస్‌ఛార్జీల విషయానికి వస్తే 2018 సంవత్సరములో ఉన్న చార్జీలే ఇప్పుడు అమలు అవుతున్నాయి. వాటి వల్ల ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం అందించలేక ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో ప్రభుత్వం మెస్‌ఛార్జీలను పెంచే ఆలోచనలో ఉంది.

ప్ర: హాస్టల్ సిబ్బందికి బయోమెట్రిక్ విధానం అమలులో ఉందా?

జ : హాస్టల్ సిబ్బంది బయోమెట్రిక్ విధానాన్ని అవలంబిస్తున్నారు. దాని ద్వారా ఏ అధికారి విధులకు హాజరు కాకపోతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తుంది. ఈ తరుణంలో సిబ్బంది హాజరుపై సంజాయిషి ఇస్తున్నారు. ఈ విధానంతో సిబ్బంది వంద శాతం విధులకు హాజరవుతున్నారు.

ప్ర: అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎప్పుడు మంజూరు చేస్తారు?

జ: సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిధిలో రెండు రకాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటి, మూడు నుండి పదవ తరగతి వరకు ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆప్‌కార్డ్ నుండి నెలనెలా వేతనాలు అందుతున్నాయి. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి 30 నెలల నుండి వేతనాలు అందడం లేదు. వారికి మదర్‌థెరిస్సా ట్రస్ట్ నుండి వేతనాలు అందాల్సి ఉంది. ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేస్తే మదర్‌థెరిస్సా ట్రస్ట్ బదలాయింపు చేసి వారికి వేతనాలు మంజూరు చేస్తారు.

ప్ర : హాస్టళ్ల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేవి?

జ : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోంది. ప్రధానంగా అద్దె భవనాల్లో ఉన్న వసతిగృహాలపై దృష్టి పెట్టింది. నాడు నేడు కింద శాశ్వత భవనాలు నిర్మించి హాస్టళ్లను ఉత్తమ స్థాయిలో తీర్చిదిద్దాలన్న దృక్పథంతో ప్రభుత్వం ఉంది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సౌకర్యవంతంగా హాస్టళ్లను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించనున్నాం.

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివరంగప్రసాద్

ఐఐటి ఫలితాల్లో రొద్దం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - రొద్దం

ఐఐటి అడ్వాన్స్ ఫలితాల్లో రొద్దం విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. సోమందేపల్లి విద్యుత్ శాఖ ఏఈగా పనిచేస్తున్న రొద్దం సంజీవప్ప హిందూపురంలో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు అరవింద్ మారుతి ఐఐటి అడ్వాన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 1,745, ఆల్ ఇండియా ఒబిసి ర్యాంక్ 294 సాధించాడు. అరవింద్ ఒకటి నుంచి 5 వరకు ఎల్ఆర్‌జి స్కూల్‌లో, 6, 7 తరగతులు అనంతపురం శ్రీచైతన్య, 8 నుంచి 10 వరకు విజయవాడ శ్రీచైతన్య, ఇంటర్ విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో చదివాడు. పదో తరగతిలో పదికి పది పాయింట్లు, ఇంటర్‌లో 964/1000, జేఈఈ మెయిన్ ర్యాంక్ 1,491, ఎయిర్ జేఈఈ మెయిన్స్ ఓబీసీ ర్యాంక్ 250, జేఈఈ అడ్వాన్స్ ర్యాంక్ 1,745, జేఈఈ అడ్వాన్స్ ఓబీసీ ర్యాంకు 294 సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన కుమార్తె అంజలి లావణ్య నెల్లూరులో ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. అరవింద్ మారుతికి పలువురు అభినందనలు తెలిపారు.

ప్రారంభానికి నోచని గ్రామ సచివాలయాలు

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్మాణం పూర్తయినా సచివాలయ భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. బత్తలపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పెడబల్లి-2 సచివాలయ భవనంతో పాటు చెర్లోపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో భవన నిర్మాణం పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఒక్కో భవనాన్ని రూ. 48 లక్షల వ్యయంతో నిర్మించారు. పెడబల్లి-2 సచివాలయం పనులు పూర్తయి 6 నెలలు కావస్తోంది. దీనికి తోడు పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు పూర్తయినా వాటిని ప్రారంభించడానికి ముహూర్తం ఖరారు కాలేదు. లక్షల ఖర్చు చేసి నిర్మించిన భవనాలను ప్రారంభించేందుకు అభ్యంతరాలు ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా చిన్న చిన్న పనులు మినహా పనులన్నీ పూర్తయ్యాయని, వాటిని సైతం వెంటనే పూర్తి చేసి ప్రారంభ తేదీ ఖరారు చేస్తామని గుత్తేదారులు తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి వాటి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

పెడబల్లిలో ప్రారంభం కాని సచివాలయ భవనం

అక్రమంగా తరలుతున్న ప్రకృతి సంపద

ప్రజాశక్తి రొళ్ల

పకృతి సంపదను కాపాడాల్సిన అధికారులు భక్షకులుగా మారుతున్నారన్న విమర్శలున్నాయి. విలువైన పకృతి సంపదకు భద్రత కల్పించాల్సిన ఆయా శాఖల అధికారులు నల్లమాఫియాతో చేతులు కలిపి మామూళ్లను పంచుకుంటున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. మండలంలో ఇసుక, గ్రావెల్. ఎర్రమట్టి, కొండరాళ్లు, చెట్ల కొట్టివేత వంటి వాటితో పాటు అత్యంత విలువైన తెల్లరాయిని కూడా కొంతమంది ఘనులు దోచేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక అధికారుల నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారే తప్ప విలువైన సంపదను దోచుకుంటున్న మాఫియాపై కనీస చర్యలు కూడా తీసుకులేక పోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండిపడుతోంది. మండలంలో ఇసుక నుంచి మట్టి వరకు ఏది వదలకుండా నిత్యం ట్రాక్టర్లలోనూ, టిప్పర్లలో, లారీలలో, బహిరంగంగా తరలిస్తూ విక్రయిస్తున్నారు. కోట్ల రూపాయిల సంపదను నల్లమాఫియా కొల్లగొడుతుంటే సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పకతి సంపద దోపిడీలో అత్యధికంగా మైనింగ్, రెవిన్యూ, ఫారెస్ట్ పోలీసులకు పెద్ద ఎత్తున ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు పెద్దఎత్తున వినపడుతున్నాయి. ఆయా శాఖల అధికారులు బదిలీపై ఇక్కడి వచ్చేందుకు పోటీ పడుతున్నారని అందుకోసం అవసరమైన పోస్టింగ్ కోసం లక్షల రూపాయలు వెచ్చిస్తుంటారని సమాచారం. ఈ నేపథ్యంలో ఆసొమ్మును తిరిగి రాబట్టుకునేందుకు మాఫియా తో చేతులు కలిపి అక్రమ రవాణాను ప్రోత్సాహం ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం రాష్ట్ర స్థాయి అధికారులకు తెలిసినా మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి మాఫియాకు పరోక్షంగాను ప్రత్యక్షంగాను సహాయ సహకారాలు అందిస్తున్న అవినీతి అధికారులపై మాత్రం గట్టి చర్యలు తీసుకోలేక పోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఫలితంగా దోచుకో దాచుకో అన్న శైలిలో అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వ ఖజానాకు దగ్గరుండి గండి కొడుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

పేట్రేగుతోన్న మాఫియా

అధికారుల తీరుపై అనుమానాలు

ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

అక్రమంగా లారీలో తరలిస్తున్న గ్రానైట్

ఐదుగురు ఎస్ఐలు బదిలీ

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరి రూరల్ ఎస్ఐ బాబ్‌జాన్ రొళ్లకు, అర్బన్ ఎస్ఐ ఇషాక్‌బాషా మడకశిరకు, టౌన్ ఎస్ఐ ఇస్మాయిల్‌ఖాన్ గోరంట్ల అర్బన్ స్టేషన్‌కు, గోరంట్ల అర్బన్ ఎస్ఐ ఇక్బాల్‌ఖాన్ బిసిఆర్‌బి జిల్లా కార్యాలయానికి, ఎన్.వెంకట రమణను విఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. వీరు ఆయా పోలీస్ స్టేషన్లలో సోమవారం రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

19న కలెక్టరేట్ వద్ద ధర్నా

సోమందేపల్లి: చేనేత కార్మికుల సమస్యలపై ఈ నెల 19వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు చేనేత కార్మిక జిల్లా కమిటీ సభ్యులు రాజగోపాల్ పిలుపునిచ్చారు. సోమందేపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ చేనేత రంగం కనమరుగై పోతుందని, కార్మికులు నేత వత్తితో జీవనం సాగించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యాంన్నారు. నేతన్న నేస్తం కొద్దిమందికే అందుతుందని, ఆయా సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి చాంద్ బాషా, అధ్యక్షులు చంద్ర, నాయకులు గంగరాజు, శ్రీకాంత్, రామాంజనేయులు, సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేశులు, బాలస్వామి, కార్మికులు ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు

వ్యకాసం సభ్యత్వ నమోదు

లేపాక్షి: మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 29, 30 తేదీల్లో బ్రహ్మం గారిమఠంలో జరిగే రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం శిక్షణ తరగతులకు ఉపాధి కార్మికులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక సంఘం నాయకులు పి.ప్రవీణ్ కుమార్, కృష్ణమూర్తి, గంగరాజు, ప్రేమవతి, కార్మికులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నేత మృతికి సంతాపం

మడకశిర: మండల పరిధిలోని జిల్లెడగుంట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ రామచంద్రగౌడ్ ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ఈరన్న, వక్కలిగ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎంపి పాండురంగప్ప, రైతు కార్యదర్శి ఉగ్రనరసింహప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, మాజీ ఎంపిపి అశ్వత్థామప్ప, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వసతి గృహాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ అధికారి సరస్వతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, బీఈడీ, టీటీసీ చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, విద్యార్థినులకు 100 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈ నెల 30వ తేదీ లోగా వసతి గృహంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97047 83061 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ జాబితా విడుదల

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల ప్రవేశ జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. 11వ తేదీ పాఠశాలలో జరిగిన 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థుల జాబితాను నోటీస్ బోర్డులో అతికించామని, అర్హత పొందిన విద్యార్థులకూ సమాచారం అందజేస్తామని తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు ఆధార్ కార్డు, 5వ తరగతికి సంబంధించిన ధ్రువ పత్రాలు సోమవారం ఆదర్శ పాఠశాలలో అందజేసి ప్రవేశం పొందాలని సూచించారు.

లోకేష్ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిర రూరల్ : నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గ తీగలచెరువు గ్రామంలో సాగుతున్న 'యువగళం' పాదయాత్రలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఈరన్న నారా లోకేష్‌తో కలిసి పాదయాత్రలో నడిచారు. ఈ సందర్భంగా ఈరన్న మడకశిర ప్రాంతంలోని పలు విషయాలను లోకేష్ దీష్టికి తీసుకెళ్లారు. ఈరన్నతో పాటు తనయుడు డాక్టర్ సునిల్, రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ పాండు రంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, ఆదినారాయణ, అశ్వర్థరామప్ప, ఉగ్రనరసింహప్ప, రామాంజనేయులు, మంజునాథ్, పత్తికొండ నరేష్ ఉన్నారు.

బాధిత భర్త వినూత్న నిరసన

భార్యను తీసుకెళ్లిన వ్యక్తి ఫొటోతో ఊరేగింపు

మడకశిర రూరల్ : ఓ వ్యక్తి చేసిన విడ్డూరమైన పనితో గ్రామస్తులు ఆశ్చర్యపోయిన, అసహనం వ్యక్తం చేసిన సంఘటన శనివారం రాత్రి మండల పరిధిలోని క్యాంపురం గ్రామంలో చోటు చేసుకుంది. క్యాంపురం గ్రామానికి చెందిన అంజి భార్యను దివాకర్ అనే వ్యక్తి తీసుకెళ్లాడు. దీంతో అంజి దివాకర్ ఫొటోను ఓ సైకిల్‌కి తగిలించి దానికి చెప్పుల హారం వేసి తప్పెట్లు మోగిస్తూ ఊరంతా తిరిగాడు. ఈ క్రమంలో గ్రామంలోని కొందరు ఆ ఫొటోను చెప్పులతో కొట్టగా మరికొందరు ఇదెక్కడి విడ్డూరం అని చెవులు కొరుక్కున్నారు.

చెప్పుల దండ వేసి ఫొటోను ఊరేగిస్తున్న బాధిత భర్త

మినీ మినిఫెస్టో చూపుతున్న పరిటాల శ్రీరామ్. మాట్లాడుతున్న పరిటాల సునీత

అరాచకపాలన పోవాలి.. టిడిపి రావాలి

పరిటాల శ్రీరామ్, సునీత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరంలో ఏ పని జరగాలన్నా వైసిపి నాయకులకు కప్పం కట్టాల్సిందేనని.. ఇలాంటి అరాచకపాలన పోవాలి.. టిడిపి అధికారంలోకి రావాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం 21 నుంచి 40వ వార్డు వరకూ పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్, సెక్షన్ ఇన్‌ఛార్జిలతో సమావేశాన్ని నిర్వహించగా మాజీ మంత్రి పరిటాల సునీత, శ్రీరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ వైసిపి నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టిడిపి అధికారం లోకి వచ్చిన తరువాత ఏం చేయాలన్న దానిపై చంద్రబాబు ముందస్తుగానే ఒక ప్రణాళికతో ముందుకెళుతున్నారన్నారు. ఇందులో భాగంగా మినీ మేనిఫెస్టో ప్రకటించారన్నారు. పరిటాల సునీత మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు శ్రీరామ్ బాధ్యతలు తీసుకున్నాడు, మీరంతా ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, చింతలపల్లి మహేశ్ చౌదరి, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, నాగూర్ హుస్సేన్, మేకల రామాంజినేయులు, భీమనేని ప్రసాదనాయుడు, అత్తరహీంబాషా, రాంపురం శీన, గంగారపు రవి, పఠాన్‌బాబుఖాన్, ఓంప్రకాశ్, సంగాల బాలు, బొట్టు కిష్ట, పూలకుంట్ల మహేష్, చీమల రామాంజి, గోసల శ్రీరాములు, కొత్తపేట ఆది, శీలామూర్తి, మాదన సుబ్బయ్య, చట్టా లక్ష్మీనారాయణ, అడ్డా మహేష్, శ్రీనివాసులు, బీబీ, పల్లపు శివశంకర్ పాల్గొన్నారు.

అమర్‌నాథ్ హంతకులను అరెస్టు చేయాలి

ధర్మవరం టౌన్ : రేపల్లె నియోజకవర్గంలో అమర్‌నాథ్‌గౌడ్ హత్యకు కారకులైన వైసిపి నాయకులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇర్షాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇర్షాద్ మాట్లాడుతూ రాజోలులో ఆమర్‌నాథ్ గౌడ్ అనే బాలుడిని వైసిపి అల్లరిమూకలు గంజాయి మత్తులో సజీవ దహనం చేయడం బాధాకరమ న్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షులు బోగం వినోద్, నాయకులు గొట్లూరు వినోద్, కార్యదర్శి చిన్నూరు నారాయణస్వామి, నాయకులు బిల్లే రామకష్ణ, తిరుపాలు, రాజా, వికాస్, నాగేంద్ర, సాయి పాల్గొన్నారు.

కళాజ్యోతి సర్కిల్లో నిరసన చేపడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

అమర్‌నాథ్ హంతకులను శిక్షించాలి : పార్థసారథి

పెనుకొండ: రేపల్లె నియోజకవర్గంలో అమర్‌నాథ్ అనే బాలుడి సజీవ దహనానికి కారకులైన వైసిపి సైకోలను శిక్షించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయన్నారు. వైసిపి ప్రభుత్వంలో అరాచకాలు ఎక్కువైపోయాయని విమర్శించారు. ప్రశ్నిస్తే ఎదురు దాడికి దిగుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి సైకో ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని, జగన్ ప్రతి చర్యను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అమర్‌నాథ్ కుటుంబానికి న్యాయం జరిగేలా టిడిపి కృషి చేస్తుందని, భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆరోగ్యానికి మించిన ఐశ్వర్యం లేదు : డిఎస్‌పి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

సంపూర్ణ ఆరోగ్యాన్ని మించిన ఐశ్వర్యం మరొకటి లేదని డీఎస్పీ శ్రీలత పేర్కొన్నారు. పట్టణంలోని రాణిపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సివి మదన్ కుమార్ ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరాం వైద్యశాల సౌజన్యంతో రోటరీ క్లబ్ సహ కారంతో ఉచిత కంటి, గుండె, మోకాళ్ల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా డిఎస్పి ప్రారంభిం చారు. కంటి వైద్య నిపుణులు రమణయ్య, రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై కంటి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 200 మంది గుండెకు, 80 మంది మోకాలుకు, 70 మంది కంటికి సంబంధించి చికిత్స చేయించుకున్నారు. 60 మందిని కంటి లేజర్ ఆపరేషన్‌కు నంద్యాలకు పంపించారు. 60 మందికి 2 డీ, ఈసిహెచ్‌ఓ, ఈసీజీ పరీక్షలు చేయించినట్లు తెలిపారు. డాక్టర్ మదన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి మూడో ఆదివారం మున్సిపల్ రాణి పేట పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. అనంతరం కంటి వైద్య నిపుణులు రమణయ్య, రామకృష్ణ డిఎస్పి శ్రీలతను సత్కరిం చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పృథ్వి పాఠశాల హెచ్ఎం జనార్ధన, పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు, వైసిపి నాయకులు కొమ్ము విజయభాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిఎస్ అహ్మద్‌బాషా, ఆరోగ్య శాఖ అధికారి బాషా, సివి మదన్ కుమార్ మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య నిపుణులు రామకష్ణకు సన్మానం

దివికెగిసిన 'తేజ'ం

వ్యవసాయ కుటుంబంలో పుట్టి నాసా శాస్త్రవేత్తగా ఎదిగి..

పరిగి-ప్రజాశక్తి

అతను పుట్టింది పేద కుటుంబంలో అయితేనేం తనకంటూ గుర్తింపు ఉండాలని పరితపించి నాసా శాస్త్రవేత్తగా ఎదిగి ఎందరికో ఆదర్శంగా నిలిచిన వ్యక్తి వంగలపల్లి తేజప్ప. పరిగి మండలం బీచిగానిపల్లి పంచాయతీలోని ఓ చిన్న గ్రామం వంగలపల్లిలో జన్మించాడు. పరిగి ఉన్నత పాఠశాలలో పదో తరగతి మొదటి ర్యాంకులో పాసవడంతో తల్లిదండ్రులు సంజీవప్ప, కామాక్షమ్మ వ్యవసాయ భూమిని సైతం అమ్మి ఉన్నత చదువులు చదివించారు. కర్నాటకలోని తుమకూరులో పీయూసీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. బెంగళూరులో ఉన్నత విద్యనభ్యసించి రష్యాలో ఎంఎస్సీ అస్ట్రో ఫిజిక్స్ పూర్తి చేశారు. 1983లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ కోరమంగళలో ఆస్ట్రో ఫిజిక్స్ శాస్త్రవేత్తగా పనిచేశారు. 1989 నుంచి నాసాలో ఖగోళ శాస్త్రవేత్తగా పనిచేస్తూ ఇటీవల తుది శ్వాస విడిచారు. ఆయన బీచిగానిపల్లి పాఠశాలలో ఎన్నో మౌలిక వసతులు కల్పించారు. సోదరుడి సాయంతో గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత పరీక్షలు చేసి మందులను అందించేవారు. 1979లో శైలజ కుమారిని వివాహం చేసుకోగా ముగ్గురు సంతానం కలిగారు. ఎందరో యువతకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ తేజప్ప మృతితో గ్రామస్తుల, మండల ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కుటుంబ సభ్యులతో డాక్టర్ తేజప్ప (వృత్తంలో తేజప్ప)

ప్రమాదకరస్థితిలో రోడ్డు

రొద్దం: స్థానిక ఎల్‌జిబి నగర్ నుంచి రాచురు మీదుగా కర్నాటక సరిహద్దు వరకూ ఏర్పాటు చేసిన రోడ్డు కొన్ని చోట్ల ప్రమాదకరంగా మారినట్లు వాహనదారులు వాపోయారు. కొగిర-కంచెంద్రం మధ్యలో మలుపు వద్ద నూతనంగా నిర్మించిన రోడ్డుకు పక్కనే ఉన్న మట్టిని వేయడంతో 10 అడుగుల లోతుతో వంద మీటర్ల దూరం వరకు మట్టిని తీసివేయడంతో ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. రాత్రివేళ ఏమాత్రం ఏమరు పాటుగా ఉన్నా పెద్ద కాలువలో పడే అవకాశాలు ఉన్నాయి. కావున అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకర స్థితిలో ఉన్న రోడ్డు

గౌడ, ఈడిగల అభివృద్ధికి కృషి

బుక్కపట్నం: గౌడ, ఈడిగ కులస్తుల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు అండగా ఉంటానని జిల్లా గౌడ, ఈడిగ సంఘం నూతన అధ్యక్షులు కెంపరాజు వెంకటరమణ తెలిపారు. బుక్కపట్నంలో శనివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా నూతన అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గౌడ, ఈడిగల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు సంఘం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజశేఖర్, మహేష్‌బాబు, మురళీకృష్ణ, అంజి, బాబు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోండి

బత్తలపల్లి : ప్రధానమంత్రి కిసాన్ పథకం కోసం అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎఒ ఓబిరెడ్డి సూచించారు. మండలంలో 8,632 మంది రైతులు నమోదు చేసుకోగా 1,918 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. ఈకేవైసీ చేయించుకోని రైతుల జాబితా గ్రామ పరిధిలోని ఆర్‌బికె సిబ్బంది వద్ద వుందని, జాబితాలో ఉన్న రైతులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-బుక్కపట్నం

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన బుక్కపట్నంలో ఇంటింటికీ తిరిడి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపిని గెలిపించి మరోమారు అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మి రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతి, సింగిల్ విండో అధ్యక్షులు రామలింగారెడ్డి, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్, పతాంజలి, నాగభూషణం, నారాయణస్వామి, మహేష్, మల్లికార్జున, నగేష్, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మెమెంటో అందుకుంటున్న బాలం సాయి ప్రసాద్

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

ధర్మవరం టౌన్ : విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు వెళితే విజయం తప్పక సాధించవచ్చని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పద్మశ్రీ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ 'జగనన్న అనంత ఆణిముత్యాలు' పథకం విద్యార్థులకు వరం అన్నారు. 'జగనన్న అనంత ఆణిముత్యా లు' కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూల్ విద్యార్థులు జి.ఆదిశంకర్, ఎం.మురళీ కృష్ణ(586)లకు రూ. 50వేల చొప్పున, కె.కృష్ణతులసి(585)కి రూ. 30వేలు, ఎన్.నందిని(583)కి రూ. 15వేలు నగదుతో పాటు ప్రశంసాపత్రం, మెమెంటోను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే తిప్పేస్వామి అందజేశారన్నారు. అనంతరం విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు. అలాగే బిఎస్ఆర్ పురపాలకోన్నత పాఠశాల విద్యార్థి బాలం సాయి ప్రసాద్(586)కు రూ. 30 వేలు ప్రశంశాపత్రం, మెమెంటోను కలెక్టర్ అరుణ్‌బాబు, తిప్పేస్వామి అందజేశారు. విద్యార్థిని హెచ్ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు, అభినందించారు.

తెలుగుతమ్ముళ్లు సైనికుల్లా పనిచేయాలి

కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక పివిఆర్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైసిపి అధికారం చేపట్టాక టిడిపి కుటుంబ సభ్యులను పెట్టిన కష్టాలను గుర్తించుకొని కందికుంట భావోద్వేగంతో కంటతడి పెట్టారు. అనంతరం భవిష్యత్తులో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, చంద్రబాబు బస్సు యాత్రపై చర్చించారు. 23వ తేదీ చంద్రబాబు బస్సు యాత్రను విజయవంతం చేయాలని కందికుంట కోరారు. అంతకుముందు కందికుంట జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. నల్లచెరువు మండలం దామవాండ్లపల్లెకు చెందిన జశ్వంత్ తల్లిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నా జాతీయస్థాయిలో నీట్ ర్యాంక్ సాధించాడని అభినందించారు. పేద విద్యార్థులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు బండారు మనోహర్ నాయుడు, శేషు, పర్వీన్‌బాను, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, బిసి సంఘం అధ్యక్షుడు నాగప్ప, విజయ ఫౌండేషన్ నిర్వాహకులు బంగారు కృష్ణమూర్తి, మండలాల కన్వీనర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్యమ్రానికి హాజరైన తెలుగుతమ్ముళ్లు, ఇన్‌సెట్‌లో కందికుంట

గోడపత్రికలను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

ప్రజా సైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కండి

ధర్మవరం టౌన్ : జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి ప్రజాసైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బషీర్, రాష్ట్ర కార్యదర్శి మహేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సూర్యస్కూల్‌లో జెవివి సభ్యత్వ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు, అభిమానులు జెవివిలో సభ్యులుగా చేరి 'ప్రజాసైన్స్' ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. మూఢ నమ్మకాలను నిర్మూలించడమే జెవివి ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్రెడ్డి, పట్టణ కార్యదర్శి నరేంద్ర, నాయకులు లోకేశ్, సురేశ్, నాగేంద్ర. మల్లికార్జున, వాసుకుమార్, ఖలందర్, పర్వతయ్య పాల్గొన్నారు.

చేనేతల సమస్యలపై 'చిలకం'కు వినతి

ధర్మవరం టౌన్: చేనేత కార్మికుల సమస్యలపై ఆదివారం చేనేత నాయకులు చిం తా శ్రీనివాసులు, లోకేశ్, క్రిష్ణప్ప, వెంకటనారాయణ జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో అన్ని వర్గాల ప్రజలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, అయితే ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పవర్ లూమ్స్‌లో తయారుచేసిన చీరలను హ్యాండ్లూమ్స్‌లో తయారు చేసినట్టు చెబుతూ రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారన్నారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఫలితం లేదని వాపోయారు. స్పందించిన చిలకం జనసేన పార్టీ అధికారంలోకి వస్తే చేనేతలను అన్ని విధాలా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటే ఊరుకోం

పరిగి : మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామం బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడంపై దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి విగ్రహ ఏర్పాటును స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ కంఠం స్థలంలో విగ్రహం ఏర్పాటు చేస్తే అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఇకపై దళిత సంఘాల ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు పనులు చేస్తామని అడ్డుకుంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమావేశానికి తరలిన తెలుగు తమ్ముళ్లు

తనకల్లు : కదిరి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి తెలుగుతమ్ముళ్లు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, శంకర్ నాయుడు, రాజారెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, చిన్నప్ప, శంకర్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి..

మరొకరి పరిస్థితి విషమం

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు తోపు 44వ జాతీయ రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ధర్మవరం పట్టణానికి చెందిన దుర్గేష్(25), వీరయ్య ద్విచక్రవాహనంపై అనంతపురం వైపు వెళ్తుండగా వెనుకవైపు నుంచి ఓ లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో దుర్గేష్(25) అక్కడికక్కడే దుర్మరణం చెందగా వీరయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు బాగేపల్లి ఆసుపత్రికి తరలించారు. దుర్గేష్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

హిందూపురం: పట్టణంలోని చైతన్య నగర్ సమీపంలోని ఎఆర్ అసుపత్రి వెనుక మురికి కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృత దేహాన్ని వెలికితీసి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడిని చాంద్‌బాషా(38)గా గుర్తించి అతడి తల్లిదండ్రులకు సమచారం ఇచ్చారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ ఈరన్న తెలిపారు.

మృతిచెందిన చాంద్‌బాషా

అదృశ్యమైన బాలిక క్షేమంగా ఇంటికి

రొళ్ల: మండల పరిధిలోని హొట్టెబెట్ట గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ కుమార్తె వనజ(16) ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించకుండి పోవడంతో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉండగా వనజ శనివారం క్షేమంగా ఇంటికి చేరింది. కర్నాటకలోని సంద్ర గ్రామంలో ఉన్న అవ్వ, తాతల ఇంట్లో నాలుగు రోజులు ఉన్నానని, ఫోన్ అందుబాటులో లేకపోవడంతో తల్లికి సమాచారం ఇవ్వలేకపోయానని వనజ ఎస్సై వెంకటరమణతో పేర్కొంది. వనజ తల్లి కేసు ఉపసంహరించుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కదిరి టౌన్: కదిరి రూరల్ మండల పరిధిలోని కొండమనాయునిపాలెం వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మండలం పరిధిలోని కెఎన్ పాళ్యం గ్రామం వద్ద అనంతపురం ప్రాంతీయ నిఘా అధికారులు సిఐ సాయివరప్రసాద్, ఎస్ఐ పి.ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఎఇఇ టి.రాజశేఖర్, సిబ్బంది, స్థానిక మండల రెవెన్యూ అధికారులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అక్రమంగా రవాణా చేస్తున్న 169.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేయడంతో పాటు ఐచర్, కారును స్వాధీనం చేసుకున్నారు. అలాగే బోయ నరసింహులు (ఐచర్ డ్రైవర్), యర్రగుంట్ల గ్రామం రాప్తాడు మండలం, జి.సుబ్బరాయుడు(క్లీనర్), కేతిరెడ్డి కాలనీ, ధర్మ వరం, బి.ప్రసాద్‌నాయక్(టాటా ఇండికా డ్రైవర్), అడవి బ్రాహ్మణపల్లి గ్రామం, ముదిగుబ్బ, ఏ.రామచంద్ర (క్లీనర్), ధర్మవరం, పి.రమేష్‌నాయక్ (బియ్యం వ్యాపారి), వై.కిరణ్‌కుమార్‌రెడ్డి (ఐచర్ యజమాని)పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాదాస్పద స్థలంలో కోర్టు ఉత్తర్వుల బోర్డు తొలగింపు

రామగిరి : మండల పరిధిలోని పేరూరు గ్రామానికి చెందిన బడిగి నాగభూషణ, నాగిరెడ్డిల మధ్య కొంతకాలంగా స్థలం వివాదం కోర్టులో నడుస్తున్న నేపథ్యంలో శనివారం నారాయణరెడ్డి కుమారులు, సోదరులు అనుచర వర్గంతో వచ్చి జెసిబితో నాగభూషణ స్థలంలో ఏర్పాటు చేసిన కోర్టు ఉత్తర్వుల బోర్డును తొలగించినట్లు బాధితుడు నాగభూషణ వాపోయారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారు గతంలో తమపై పలుమార్లు దౌర్జన్యానికి పాల్పడ్డాడని, పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదని ఆరోపించాడు. ఈ స్థలం విషయంలో కోర్టును ఆశ్రయించామని, కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటున్న తమపై దాడికి దిగుతున్నారని ఆరోపించారు.

సిపిఎం పట్టణ కార్యదర్శిగా నాగార్జున

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణానికి చెందిన నామాల నాగార్జునను సిపిఎం పట్టణ కార్యదర్శిగా ఎంపిక చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా నాయకులు బాషా సమక్షంలో నాగార్జునను పట్టణ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికచేశారు. నాగార్జున ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా విద్యారంగ సమస్యలపై నాలుగేళ్లు పోరాడారని ఇంతియాజ్ తెలిపారు. నాగార్జున మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానిక సిపిఎం ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన పార్టీ జిల్లా నాయకత్వానికి, సీనియర్ నాయకులు. సిఐటియు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభా పురస్కారాలు అందుకున్న తొగటవీర క్షత్రియుల విద్యార్థులు

ప్రతిభా పురస్కారాలు ప్రదానం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం పదో తరగతిలో ప్రతిభ కనబరచిన 18 మంది బాలురు, 20మంది బాలికలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మొ దటి బహుమతి కింద రూ. 10వేలు, రెండవ బహుమతి కింద రూ. 6వేలు, తృతీయ బహుమతి కింద రూ. 5వేలు విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేసినట్లు సంఘం పట్టణ అధ్యక్షుడు బండారు ఆదినారా యణ తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శంకర యుగంధర్, నాయకులు కేతా లోకేశ్, నీలూరి వెంకటరాముడు, పూజారి నారాయణ, భాస్కర్, నారాయణ, గట్టు హరినాథ్, పాల్గొన్నారు.

గ్రాట్యుటీ, ఆర్జిత సెలవుల సొమ్ము విడుదల

కదిరి టౌన్: ప్రభుత్వంలోకి విలీనమైన తర్వాత పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులు, సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పెండింగ్‌లో వున్న గ్రాట్యుటీ, ఆర్జిత లీవుల సొమ్మును విడుదల చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిమోహన్ ఆదివారం తెలిపారు. కావున పదవీ విరమణ సర్వీసులో చనిపోయిన ఉద్యోగులు వెంటనే సమీప డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించి రికార్డులు అందజేయాలని ఆయన సూచించారు.

ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష

బత్తలపల్లి: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 6, 7, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న 4 సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 20వ తేదీ పాఠశాలతో రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 10 గంటలకు పాఠశాల వద్దకు చేరుకోవాలని 11 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

DHARMAVARAM MUNICIPALITY
IFB Tender Notice No.292 to 303/GGMP/2023-24/E2.
IFB Tender Notice NO.305, 306/GF/2023-24/E1.

'e' procurement Tender Notice No.292 to 303/GGMP/2023-24/E2 under GGMP 2023-2024, IFB Tender Notice No.305,306/GF/2023-24/E1 under General Funds 2023-2024 With value of work Rs.2.20 Lakhs to Rs.20.00 Lakhs & Details of name of work, Tender document, Eligibility Criteria, Bid Submission & Price bid opening date and EMD details etc., may be seen on **'e' procurement website-https://tender.apeprocurement.gov.in.**

Commissioner
Dharmavaram Municipality